సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 24 । జనవరి । 2025

I



సోమశిలలో 68.73 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 68.37 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 1872 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.82,430
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,519
3 శాతం జీఎస్టీతో	రూ.7,745
నవర (8 గ్రా)	రూ.61,960

గరిష్టం/కనిష్టం

31.1 /21.5

వాతావరణం

జిల్లాలో వాతావరణం శుక్రవారం పొడిగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 66 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

గండిపాళెం కాలువకు మరమ్మతులు



యంత్ర సాయంతో పూడికతీత పనులు

సాక్షి ఎఫెక్ట్..

ఉదయగిరి: గండిపాళెం కాలువలో చెట్లు, పూడికతీత పనులను రూ.15 లక్షల అంచనా వ్యయంతో గురువారం చేపట్టారు. ఈ ప్రాజెక్ట్‌లో కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఆయకట్టుకు నీరొదిలే పరిస్థితి లేక రైతులు ఇబ్బంది పడుతున్న వైనంపై 'గండిపాళెం నిర్వహణ గాలికి' అనే శీర్షికన సాక్షిలో కథనం బుధవారం ప్రచురితమైంది. ఈ తరుణంలో స్పందించిన అధికారులు పనులను చేపట్టారు. దీనిపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పనులు ఈ నెలాఖరు నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని, ఆ తర్వాత ఆయకట్టుకు నీరొదులుతామని ఇరిగేషన్ డీఈ చంద్రమౌళి తెలిపారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

నెల్లూరు(సెంట్రల్): ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందుల్లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని జేసీ కార్తీక్ ఆదేశించారు. కలెక్టరేట్లో వ్యవసాయ, మార్కెటింగ్, పౌరసరఫరాలు, వివిధ శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దాదాపు 11 లక్షల మెట్రిక్ టన్నులు రావొచ్చనే అంచనాల నేపథ్యంలో దానికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. కేంద్రాల వద్ద గ్రామంలోని ఓ ఆదర్శ రైతు, అధికారులు, మిల్లర్ల నుంచి ఒక ప్రతినిధి సంయుక్తంగా ఉండేలా చూడాలని సూచించారు. గోతాలు, ధాన్యం తరలింపు విషయంలో వాహనాలకు కొరత లేకుండా చూడాలని కోరారు.

కలెక్టర్ నిర్ణయాలు వివాదాస్పదం



మాట్లాడుతున్న కాకాణి, పక్కన చంద్రశేఖర్‌రెడ్డి

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): రెడ్‌క్రాస్ విషయంలో కలెక్టర్ ఆనంద్ నిర్ణయాలు వివాదాస్పదమవుతున్నాయని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీ, పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులనే నెపంతో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి, సుధీర్‌నాయుడు, నేతాజీ సుబ్బారెడ్డి, ప్రసన్నను తొలగిస్తూ ఉత్తర్వులను జారీ చేశారని తెలిపారు. వీరిని తొలగించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. మంత్రి నారాయణ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

ప్రాథమిక సూత్రాన్ని విస్మరించారు

రెడ్‌క్రాస్‌లో సభ్యత్వాన్ని తొలగించాలంటే జిల్లాకు ఎలాంటి అధికారాలు ఉండవని.. రాష్ట్ర కమిటీకి మాత్రమే ఉంటాయనే ప్రాథమిక సూత్రాన్ని కలెక్టర్ విస్మరించారని చెప్పారు. రెడ్‌క్రాస్‌ను వాడుకొని సొమ్ము చేసుకునేందుకు మంత్రి యత్నిస్తున్నారని, దీనికి అడ్డంకిగా ఉన్న చంద్రశేఖర్‌రెడ్డిని కావాలనే తొలగించారని ఆరోపించారు. తప్పును సరిదిద్దుకోవాలని, లేని పక్షంలో కలెక్టర్ నిర్ణయంపై న్యాయపోరాటం చేస్తామని ప్రకటించారు. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్‌గా ఐదేళ్లు వ్యవహరించానని, సేవాదృక్పథంతో సంస్థకు సేవ చేసిన అంశాన్ని గుర్తుచేశారు. అధికార పార్టీ నేతలకు తలొగ్గి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులనే నెపంతో ఐదుగురి ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేయడం దారుణమన్నారు. నారాయణ మెడికల్ కళాశాలలో కీలకంగా ఉండే విజయ్‌కుమార్‌ను రెడ్‌క్రాస్‌లో సభ్యుడిగా చేర్చి.. దాన్ని నాశనం చేసేందుకు యత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేతాజీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

..అనుకుందే అయింది..!

- రెడ్‌క్రాస్ చైర్మన్‌గా వాకాటి విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు(అర్బన్) / నెల్లూరు(బారకాసు): రెడ్‌క్రాస్‌లో మంత్రి నారాయణ రాజకీయాలు సక్సెసయ్యాయి. ముందు నుంచే అనుకుంటున్నట్లు మంత్రి సహకారంతో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్‌గా వాకాటి విజయకుమార్‌రెడ్డిని ఎన్నుకున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుకూలురుగా ముద్రవేసి రెడ్‌క్రాస్ ఎమ్సీ మెంబర్లుగా ఉన్న ఐదుగుర్ని కలెక్టర్ ఆనంద్ ఇటీవల తొలగించారు. అంతటితో ఆగకుండా వీరి ప్రాథమిక సభ్యత్వాన్నీ రద్దు చేశారు. రెడ్‌క్రాస్ పాలకమండలిలో ఇక మిగిలిన పది మందితో చైర్మన్ ఎన్నికను కలెక్టర్ ఆదేశాలతో కలెక్టరేట్లో డీఆర్వో ఉదయభాస్కర్‌రావు గురువారం నిర్వహించారు. అయితే వీరిలో కోశాధికారిగా ఉన్న సురేష్‌కుమార్ జైన్ సమావేశానికి హాజరుకాలేదు. మిగిలిన సభ్యులు వాకాటి విజయకుమార్‌రెడ్డి, రంగయ్యనాయుడు, బయ్యా ప్రసాద్, యడవల్లి సురేష్, దాసరి రాజేంద్రప్రసాద్, గునుపాటి ప్రసాద్‌రెడ్డి, రవిప్రకాష్, కలికి శ్రీహరిరెడ్డి, చామర్తి జనార్దన్‌రాజు హాజరయ్యారు. వీరందరూ వాకాటి విజయకుమార్‌రెడ్డిని చైర్మన్‌గా, చామర్తి జనార్దన్‌రాజును వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. సురేష్‌కుమార్‌జైన్‌ను కోశాధికారిగా కొనసాగించేందుకు తీర్మానించారు. ఎన్నికైన వారిని కలెక్టరేట్ ఆవరణలో పలువురు సత్కరించారు.

హాజరుకాని కలెక్టర్

ఎన్నిక జరిగే సమయంలో సమావేశానికి కలెక్టర్ హాజరుకాలేదు. విమర్శలొస్తాయనో.. లేదా ఇతర కారణమో ఎన్నిక ప్రక్రియను డీఆర్వోతో చేయించారు. ఎన్నిక అనంతరం కలెక్టరేట్‌కు వచ్చారు. ఎన్నికైన వారు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు.

సభ్యత్వ తొలగింపునకు కోర్టు చెక్

రాజకీయ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారనే కారణం చూపి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులుగా ముద్రవేసి ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డితో పాటు ఐదుగురు రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులను కలెక్టర్ తొలగించారు. దీంతో వీరు కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో ప్రాథమిక సభ్యత్వం నుంచి వీరిని తొలగించడం కుదరదంటూ కోర్టు స్టే ఇచ్చింది. వీరిని సభ్యులుగా కొనసాగించాలని పేర్కొంది. దీంతో కలెక్టర్ నిర్ణయానికి చెక్ పడింది. కలెక్టర్‌పై ఒత్తిడి తెచ్చి ఈ రకంగా మంత్రి నారాయణ వ్యవహరించారని వారు ఆరోపించారు. కోర్టు తీర్పుతో తమకు న్యాయం జరిగిందని ఎమ్మెల్సీ పేర్కొన్నారు.



రెడ్‌క్రాస్ చైర్మన్, వైస్ చైర్మన్‌కు అభినందన



సింధుప్రియ

కచ్చితమైన లక్ష్య సాధన.. అకుంఠిత దీక్ష.. ప్రణాళికబద్ధమైన కృషి ఉంటే సాధించలేనిదంటూ ఏమీ ఉండదని నగర డీఎస్పీ పెసర సింధుప్రియ పేర్కొన్నారు. తల్లిదండ్రుల స్ఫూర్తి.. భర్త ప్రోత్సాహంతో తాను ఈ స్థాయికి చేరుకున్నానని చెప్పారు. నగర ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు అందించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. తనను గురువారం కలిసిన 'సాక్షి'తో ఆమె మాట్లాడారు.

\- సాక్షి ప్రతినిధి, నెల్లూరు

కుటుంబ ప్రోత్సాహంతోనే ఈ స్థాయికి

- సమాజానికి సేవ చేయాలనేదే లక్ష్యం
- ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు అందిస్తా

సాక్షితో నగర డీఎస్పీ సింధుప్రియ

కుటుంబ నేపథ్యం..

మాది తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా వీరారెడ్డిపల్లి. తండ్రి లింగారెడ్డి, తల్లి వనజాక్షి, సోదరుడు నందకుమార్‌రెడ్డి. తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడు.. సోదరుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్.. భర్త కల్యాణ్ చక్రవర్తి హైకోర్టు న్యాయవాది.

విద్యాభ్యాసం..

చదువుల నిమిత్తం కుటుంబం హైదరాబాద్‌కు షిఫ్టయింది. అక్కడే నా విద్యాభ్యాసమంతా సాగింది. మౌలాలీలోని మదర్ థెరీసా హైస్కూల్లో పదో తరగతి.. నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్.. ఎమ్వీఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ అభ్యసించా. మాస్టర్స్ ఇన్ సోషియాలజీ చేశా.

గ్రూప్స్‌నకు ప్రేరణ ఇలా..

చిన్నతనం నుంచే క్రమశిక్షణ గల జీవన విధానాన్ని తల్లిదండ్రులు నేర్పారు. సమాజంపై అవగాహన పెంపొందించి.. తమ వంతు సేవ చేయాలని నిత్యం చెప్పేవారు. ఇదే నాలో స్ఫూర్తిని కలిగించి గ్రూప్స్ రాసేలా ప్రేరేపించింది. వివాహమయ్యాక భర్త ప్రోత్సహించారు.

లక్ష్యాన్ని మరువలేదు..

గ్రూప్స్‌నకు సన్నద్ధమవుతున్న సమయంలోనే సీడీపీఓ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలైంది. 2018 సెప్టెంబర్‌లో సూర్యాపేటలో సీడీపీఓగా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించా. అనంతరం మహిళా కమిషన్‌లో పనిచేశా. మహిళలు, చిన్నారుల సంక్షేమానికి కృషి చేశా. ఉద్యోగమొచ్చిందని నా లక్ష్యాన్ని మర్చిపోలేదు.

తొలి యత్నంలోనే డీఎస్పీగా..

సీడీపీఓగా పనిచేస్తున్న సమయంలోనే ఏపీపీఎస్సీ గ్రూప్ – 1 నోటిఫికేషన్ విడుదలైంది. దీనికి దరఖాస్తు చేసుకున్నా. ఉద్యోగానికి వెళ్తూనే కష్టపడి చదివా. తొలి యత్నంలోనే 2022లో డీఎస్పీగా ఎంపికవడం ఎనలేని సంతోషాన్ని కలిగించింది. కుటుంబ సహకారం లేకపోతే ఇది సాధ్యమయ్యేది కాదు.

తొలి పోస్టింగ్ నెల్లూరు..

ప్రొబేషనరీ డీఎస్పీగా తిరుపతి జిల్లాలో పనిచేశా. నెల్లూరు డీఎస్పీగా బాధ్యతలను ఈ నెల 20న స్వీకరించా. నా తొలి పోస్టింగ్ ఇది. ఎంతో ఆనందంగా ఉంది.

విధి నిర్వహణలో రాజీలేదు..

మహిళలు, చిన్నారుల భద్రతకు తొలి ప్రాధాన్యం. వారి హక్కులకు భంగం వాటిల్లకుండా చర్యలు చేపడతా. ఇక్కడి పరిస్థితులపై అవగాహన పెంచుకొని అందరి సమన్వయంతో నగరవాసులకు మెరుగైన శాంతిభద్రతలు అందిస్తా. సైబర్ నేరాలు, మత్తు, మాదకద్రవ్యాల వినియోగంతో సంభవించే దుష్పరిణామాలపై ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తా. ఫ్రెండ్లీ పోలీసింగ్ చేపట్టి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. విధి నిర్వహణలో రాజీపడే ప్రసక్తేలేదు.

24 గంటలూ అందుబాటులో..

పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తా. 24 గంటలూ అందుబాటులో ఉంటా. ఎలాంటి సమస్యలున్నా నేరుగా నన్ను కలవొచ్చు. నేరుగా రాలేని వారు 94407 96303 నంబర్‌ను సంప్రదించొచ్చు. నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు చేపట్టే చర్యలకు ప్రజలు సహకరించాలి.

సీఆర్పీఎఫ్ జవాన్‌కు కన్నీటి వీడ్కోలు



రోదిస్తున్న భార్య, కుటుంబసభ్యులు

- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

కలిగిరి: న్యూఢిల్లీలో గుండెపోటుతో మృతి చెందిన సీఆర్పీఎఫ్ జవాన్ లింగుంటి వెంకటనరసయ్యకు అశేష జనవాహిని కన్నీటి వీడ్కోలు పలికింది. వెంకటనరసయ్య పార్థివదేహాన్ని సీఆర్పీఎఫ్ అధికారులు ప్రత్యేక వాహనంలో తెల్లపాడుకు గురువారం తరలించారు. కార్లు, బైక్‌లతో తెల్లపాడు సత్రం నుంచి మూడు కిలోమీటర్ల వరకు గ్రామస్తులు ర్యాలీగా వెళ్లి సీఆర్పీఎఫ్ వాహనాలను తీసుకొచ్చారు. తొలుత గ్రామ సచివాలయం వద్ద ప్రజలు నివాళులర్పించారు. అనంతరం వెంకటనరసయ్య నివాసం వద్దకు చేరుకున్నారు. ప్రజల సందర్శనార్థం సుమారు గంట పాటు నరసయ్య పార్థివదేహాన్ని ఉంచారు. తెల్లపాడుతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు, పలు పార్టీల నేతలు హాజరై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాడెను గ్రామస్తులు మోస్తూ శ్మశానానికి తీసుకెళ్లారు. అక్కడ అంత్యక్రియలను అధికార లాంఛనాలతో సీఆర్పీఎఫ్ అధికారులు నిర్వహించారు. కలిగిరి సీఐ వెంకటనారాయణ, ఎస్సై ఉమాశంకర్ భద్రత ఏర్పాట్లు చేశారు.

ఓదార్చిన అధికారులు

వెంకటనరసయ్య మృతదేహాన్ని చూసి ఆయన భార్య యశ్విత, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. యశ్విత, కుమారులు శ్రీనికేత్, ఇస్వాంత్ పరిస్థితిని చూసి అక్కడికి వచ్చిన అందరూ చలించిపోయారు. వారిని అధికారులు, గ్రామస్తులు ఓదార్చారు.

నాపై ఫిర్యాదు చేస్తే అట్రాసిటీ కేసు పెడతా

- చెలరేగిపోతున్న పంచాయతీ కార్యదర్శి
- అధికారులు పట్టించుకోరనే ధీమా
- హైకోర్టులో కేసు వేస్తానంటూ వీరంగం





పన్నుల వసూళ్లలో అవకతవకలపై రసీదులు చూపుతున్న స్థానికులు

బిట్రగుంట: బోగోలు మండలం నాగులవరం పంచాయతీ కార్యదర్శి భాస్కర్ వ్యవహార శైలి మరింత శ్రుతిమించింది. ఇంటి పన్ను కట్టేందుకు వచ్చిన వారితో రెండు రోజుల క్రితం దురుసుగా ప్రవర్తించిన వీడియోలు వైరల్ కావడం.. ఇదే అంశమై సాక్షిలో కథనం గురువారం ప్రచురితమైన విషయం విదితమే. ఇంత జరుగుతున్నా, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో పంచాయతీ కార్యదర్శి గురువారం మరింత చెలరేగిపోయారు.

సెల్‌ఫోన్లు బయటపెట్టి రండి..!

సచివాలయానికి వచ్చే అర్జీదారులు తమ సెల్‌ఫోన్లను బయటపెట్టి రావాలని చెప్పడంతో గ్రామస్తులు అవాక్కయ్యారు. ఇంటి పన్ను వసూళ్ల కోసం అదనంగా వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తూ సచివాలయం వద్దకు చేరుకోవడంతో పంచాయతీ కార్యదర్శి ఆగ్రహంతో ఊగిపోయారు. రూ.1500 కట్టించుకొని.. రూ.315కే రసీదు ఇచ్చారని గ్రామానికి చెందిన ఓ మహిళ.. ఇంటి పన్ను కట్టించుకునేందుకు రూ.ఐదు వేల లంచం అడిగారని ఓ వ్యక్తి.. వేరుశనగ మిల్లు కోసం రూ.50 వేల పన్ను కట్టించుకొని రూ.21,789కే రసీదును అందజేశారని మరో వ్యక్తి ఆరోపించారు. దీంతో కార్యదర్శి ఏకంగా బెదిరింపులకు దిగారు.



గ్రామస్తులతో వాగ్వాదానికి దిగిన భాస్కర్

నోటికొచ్చిన సెక్షన్లు చెప్తూ.. బెదిరింపులు

లంచం తీసుకున్నానని ఆధారాలుంటే ఏసీబీకి.. కలెక్టర్‌కు చెప్పుకోండంటూ రంకెలేశారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌నని.. ఎస్సీ క్యాండిడేట్‌నని.. తనపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే అట్రాసిటీ చట్టంతో పాటు ఐపీసీ సెక్షన్ కింద కేసు పెడతానంటూ నోటికొచ్చిన సెక్షన్ల పేర్లు చెప్తూ బెదిరింపులకు దిగారు. హైకోర్టులో ఈ రోజే పిల్ వేస్తానంటూ ఊగిపోయారు. సచివాలయం వద్ద గ్రామస్తులతో పంచాయతీ కార్యదర్శికి సుమారు గంటకుపైగా వాగ్వాదం జరిగింది. ఈ వీడియోలూ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

ఈయన మాకొద్దు..

నాగులవరం పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌ను వెంటనే బదిలీ చేసి, ఆయన వ్యవహార శైలిపై విచారణ చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇంటి పన్ను కట్టించుకునేందుకు అదనంగా వసూలు చేయడం, డబ్బులివ్వని వారితో దురుసుగా ప్రవర్తిస్తుండటంతో పాటు తప్పుడు కేసులు పెడతానంటూ బెదిరింపులకు దిగుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈయన్ను మార్చకపోతే సచివాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని చెప్తున్నారు. కలెక్టర్ స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

31లోపు రైతుల వాటా చెల్లించాలి

నెల్లూరు(సెంట్రల్): డ్రిప్, స్ప్రింక్లర్లకు దరఖాస్తు చేసుకొని సర్వే పూర్తి చేసుకున్న రైతులు వారికి సంబంధించిన నగదును ఏపీఎంఐపీకి ఈ నెల 31లోపు చెల్లించాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో దాదాపు 1444 మంది రైతులు తమ వాటాను చెల్లించాల్సి ఉందని చెప్పారు. దీనిపై గ్రామాల్లోని వీఏఏలు, వీహెచ్ఏలు అవగాహన కల్పించాలని కోరారు. ఆన్‌లైన్ ద్వారానే చెల్లించేలా చూడాలన్నారు. స్పెషల్ డ్రైవ్‌ను వ్యవసాయ, ఉద్యానాధికారులు చేపట్టనున్నారని పేర్కొన్నారు.

రహదారి భద్రత నిబంధనలు పాటించాలి

కందుకూరు: రహదారి భద్రత నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించి ప్రమాదాలను అరికట్టాలని సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని గురువారం నిర్వహించిన వాకథాన్‌ను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు ఉన్నవారే వాహనాలను నడపాలని పేర్కొన్నారు. మద్యం సేవించి.. సెల్‌ఫోన్లో మాట్లాడుతూ వాహనాలను నడపడం నేరమని చెప్పారు. అనంతరం ప్రాంతీయ రవాణా శాఖ అధికారి నాగలక్ష్మి మాట్లాడారు. మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులను సైతం బాధ్యులుగా పరిగణిస్తూ వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని చెప్పారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహ కూడలి వద్ద మానవహారం నిర్వహించి జాతీయ రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కందుకూరు మోటార్ వాహనాల తనిఖీ అసిస్టెంట్ రాంబాబు, కావలి ఏఎంవీఐ లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా.. వేధింపులు

అవినీతి రహిత పాలనను అందిస్తానని ప్రజల ముందు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తరచూ చెప్తున్నా, నియోజకవర్గంలో అవినీతి పరవళ్లు తొక్కుతోంది. దోచుకోవడం, దాచుకోవడం తప్ప అభివృద్ధిపై ధ్యాస చూపని టీడీపీ మండల ఇన్‌చార్జీలు.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులైన సర్పంచ్‌లపై పైశాచికత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. అధికార పార్టీ కండువా కప్పుకోకపోతే చెక్‌పవర్‌ను రద్దు చేయిస్తామంటూ బెదిరిస్తున్నారు. మాట వినకపోతే అనుకున్నది చేయిస్తున్నారు.



కొడవలూరు మండలానికి చెందిన ఓ దళిత మహిళా సర్పంచ్ 15వ ఆర్థిక సంఘ నిధులతో పంచాయతీలో అభివృద్ధి పనులు చేశారు. వీటికి సంబంధించిన బిల్లులను రికార్డ్ చేసిన మండల ఇంజినీరింగ్ అధికారిణి సదరు బుక్ ఇవ్వాలంటే.. మండల షాడో ఎమ్మెల్యేను పర్సనల్‌గా కలిసి రావాలని సూచించారు. ఇలా కాకపోతే బిల్లు డబ్బులు రావని తెగేసి చెప్పారు. మహిళా అధికారే ఇలా చెప్పడంతో బిత్తరపోయిన సర్పంచ్ ఇటీవల జరిగిన మండల సమావేశంలో తన ఆవేదనను వెళ్లగక్కారు. మహిళా ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో సాటి మహిళకు ఇంతకంటే ఘోర అవమానం ఇంకొకటి ఉంటుందానని కన్నీటి పర్యంతమయ్యారు.

- సర్పంచ్‌లపై కక్షపూరిత ధోరణి
- పచ్చ కండువా కప్పుకోకపోతే చెక్ పవర్ రద్దు
- చోద్యం చూస్తున్న కోవూరు ఎమ్మెల్యే
- టీడీపీ నేతల ఆదేశాలనే పాటిస్తున్న జిల్లా అధికారులు
- విసిగివేసారి ఆందోళనకు సిద్ధమైన వైఎస్సార్సీపీ
- కొడవలూరులో నిరసన నేడు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు / కొడవలూరు: కోవూరు నియోజకవర్గంలో టీడీపీ నేతల అకృత్యాలు పరాకాష్టకు చేరుతున్నాయి. మండలానికి ఇన్‌చార్జిగా ఓ చోటా నేతను నియమించడంతో షాడో ఎమ్మెల్యేగా చెలరేగిపోతూ జులుం ప్రదర్శిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల నేతలను లక్ష్యంగా చేసుకొని వేధింపుల పర్వానికి తెరలేపుతున్నారు. ఇంత జరుగుతున్నా, చేష్టలుడిగి చూడటం జిల్లా అధికారుల వంతవుతోంది.

వేధింపుల పర్వం..

- నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీ మద్దతుదారులైన సర్పంచ్‌ల చెక్‌పవర్‌ను తొలగిస్తూ వికృత క్రీడకు తెరలేపారు. అధికార పార్టీ నేతలు చెప్పినట్లు నడుచుకోలేదనే నెపంతో కొడవలూరు మండలం పెమ్మారెడ్డిపాళెం, రేగడిచెలిక సర్పంచ్‌ల చెక్‌పవర్‌ను నిర్దాక్షిణ్యంగా తొలగించారు.
- కొత్తవంగల్లుకు చెందిన దళిత మహిళా సర్పంచ్ చేపట్టిన పనులకు ఎం బుక్‌ను రికార్డ్ చేయాలని కోరితే, టీడీపీ మండల ఇన్‌చార్జిని వ్యక్తిగతంగా కలిస్తే పని అవుతుందని వేధించారు.
- ప్రతిపక్ష పార్టీ మద్దతుదారులని తెలిస్తే చాలు మధ్యాహ్న భోజన నిర్వాహకుల మొదలుకొని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఓఏలు, చౌక డిపో డీలర్లను ఎడాపెడా తొలగిస్తున్నారు.
- నార్తురాజుపాళెం హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని నిర్వహించే దళిత మహిళ యానాదమ్మకు రేషన్ ఇవ్వడాన్ని నిలిపేశారు. జీవనోపాధి కోల్పోయానని ఆమె మొత్తుకుంటున్నా, ఆమె మొర ఆలకించే నాథుడే కరువయ్యారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారు కావడమే ఆమె చేసిన నేరమనే రీతిలో చెలరేగిపోతున్నారు.
- తాము చెప్పినట్లు నడుచుకోవాలని, లేని పక్షంలో తొలగిస్తామంటూ ఉద్యోగులను అధికార పార్టీ నేతలు బెదిరిస్తున్నారు. ఫలితంగా పదుల సంఖ్యలో చిరుద్యోగులు ఉపాధి కోల్పోయి రోడ్డునపడ్డారు.

పొట్టకొట్టి.. రోడ్డున పడేసి

- కోవూరు నియోజకవర్గంలో తొలగించిన చిరుద్యోగుల జాబితాను చూస్తే ఎవరైనా నివ్వెరపోవాల్సిందే. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు సంబంధించి ఇందుకూరుపేట మండలంలో 14.. విడవలూరు మండలంలో ఆరు.. బుచ్చిరెడ్డిపాళెంలో నలుగురు.. కొడవలూరు, కోవూరులో ఒకర్ని చొప్పున తొలగించారు.
- పొదుపు వీఓఏలకు సంబంధించి కొడవలూరు, కోవూరులో ముగ్గురు చొప్పున, విడవలూరులో ఇద్దర్ని తొలగించి రోడ్డున పడేశారు.
- కోవూరు మండలంలో ఒక చౌక డిపో డీలర్‌ను తొలగించారు. రెక్కాడితే గానీ డొక్కాడని వీరిపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ, వికృతానందాన్ని పొందుతున్నారు.

ఆందోళన నేడు

కోవూరు నియోజకవర్గంలో అధికార పార్టీ నేతల అరాచకాలను అడ్డుకోవాలని కోరుతూ కొడవలూరు ఎంపీడీఓ కార్యాలయ ఎదుట ధర్నాను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్నారు. మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, నియోజకవర్గంలోని పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు.

క్లుప్తంగా

గ్యాస్ సిలిండర్ల లారీని ఢీకొన్న బస్సు

- తప్పిన ప్రమాదం



ఘటనా స్థలంలో ఆర్టీసీ బస్సు

పొదలకూరు: పట్టణంలోని రామనగర్ గేటు సెంటర్‌లో గురువారం గూడూరు డిపోకు చెందిన బస్సు గ్యాస్ సిలిండర్ల లారీని ఢీకొంది. స్థానికుల కథనం మేరకు.. ఆర్టీసీ బస్సు గూడూరుకు బయలుదేరింది. అదే సమయంలో కలువాయి నుంచి గోదాముకు వెళ్తున్న గ్యాస్ సిలిండర్ల లారీని బస్సు ఢీకొంది. సిలిండర్ల లారీ బోల్తాపడి ఉంటే అవి పేలి పెద్ద ప్రమాదమే సంభవించి ఉండేది. బస్సు మాత్రం పాక్షికంగా ముందు భాగం దెబ్బతింది.

పిచ్చికుక్క స్వైరవిహారం

- 15 మందికి గాయాలు



గాయపడిన బాలుడు

మర్రిపాడు: మండల కేంద్రమైన మర్రిపాడులో గురువారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. 15 మందిని గాయపరిచింది. వారిలో చిన్నారులు కూడా ఉన్నారు. బాధితులకు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్ చికిత్స అందించారు. పిచ్చికుక్కను స్థానికులు చంపేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ కుక్క కరిచిన బాధితులు సత్వరమే ఇంజెక్షన్ చేయించుకోవాలని సూచించారు.

రేకుల షెడ్ కూల్చివేతపై వివాదం



జేసీబీతో రేకుల షెడ్ కూల్చివేత

సీతారామపురం: మండలంలోని గంధంవారిపల్లికి చెందిన గాజులపల్లి సురేంద్రరెడ్డి అనే వ్యక్తి భూమిలోని రేకులషెడ్‌ను గురువారం రాత్రి రెవెన్యూ అధికారులు, పోలీసుల సమక్షంలో హైవే నిర్మాణానికి సంబంధించిన వారు కూల్చేశారు. దీనిపై వివాదం నెలకొంది. సురేంద్రరెడ్డి స్పందిస్తూ మారంరెడ్డిపల్లి పంచాయతీలోని సర్వే నంబర్ 139 – 2లో తనకు 1.29 ఎకరాల భూమి ఉందన్నారు. ఇందులో ఇటుకబట్టీ నిర్వహిస్తున్నట్లు చెప్పాడు. హైవే నిర్మాణం కోసం సదరు భూమిలో 70 సెంట్లను తీసుకుని రూ.3 లక్షల నష్టపరిహారం ఇచ్చారన్నారు. మిగిలిన దానికి ఇవ్వాల్సి ఉందన్నారు. కాగా ఆ భూమిలో రేకులషెడ్‌ను నిర్మించినట్లు చెబుతున్నాడు. దానిని దారి పోరంబోకు భూమిగా రెవెన్యూ అధికారులు చూపించడంతో నష్టపరిహారం ఇంకా రాలేదన్నాడు. అధికారులకు ఫిర్యాదు చేయడంతో సర్వే చేసి పట్టా భూమి అని నిర్ధారించి జేసీకి ఫైల్ పెట్టారన్నారు. అయితే నోటీసులివ్వకుండా షెడ్‌ను జేసీబీతో దౌర్జన్యంగా కూల్చేశారని ఆరోపిస్తున్నాడు. దీనిపై హైవే నిర్మాణదారులు స్పందిస్తూ దారి పోరంబోకు భూమి అని రెవెన్యూ అధికారులు చెప్పడంతో కూల్చినట్లు వెల్లడిస్తున్నారు.

బాలిక అదృశ్యం

సంగం: బాలిక అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రాజేష్ కథనం మేరకు.. చెన్నవరప్పాడు గ్రామానికి చెందిన ఓ బాలిక సంగంలో 9వ తరగతి చదువుతూ అమ్మమ్మ వద్ద ఉంటోంది. ఈనెల 19వ తేదీ నుంచి బాలిక కనిపించడం లేదు. దీంతో అమ్మమ్మ, తల్లిదండ్రులు బంధువుల ఇళ్ల వద్ద వెతికారు. ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కండలేరులో 55.336 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 55.336 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 180 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 800, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 160, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 138
లేయర్ (లైవ్) : 85
బ్రాయిలర్ చికెన్ : 246
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 270
లేయర్ చికెన్ : 145



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.30
సన్నవి : రూ.18
పండ్లు : రూ.10



ఏఆర్టీ కేంద్రంపై సర్కారు నిర్దయ

- హెచ్ఐవీ, ఎయిడ్స్ రోగుల పరిస్థితి దయనీయం
- నిత్యం 400 మందికి పైగా రాక
- రక్తపరీక్షల రూమ్‌కు బకెట్‌తో నీళ్లు తెచ్చుకుంటున్న టెక్నీషియన్
- మరుగుదొడ్లకు నెలలుగా తాళాలు
- ఇబ్బందులు పడుతున్న రోగులు, డాక్టర్లు, సిబ్బంది



మరుగుదొడ్లకు తాళాలు

వసతుల కల్పనలో నిర్లక్ష్యం

పొరపాటునో.. గ్రహపాటునో వారంతా హెచ్ఐవీ – ఎయిడ్స్ రోగులుగా మారారు. వీరు ప్రతి నెలా ఖరీదైన మందులు వాడాలి. లేదంటే మరణానికి రోజులు లెక్కపెట్టుకుంటూ బతకాల్సిందే. ఇటువంటి దయనీయులపై సర్కార్ నిర్దయగా వ్యవహరిస్తోంది. ఎన్ని మందులు వాడుతున్నా.. హెచ్ఐవీ సోకిన వారికి తరచూ డయేరియా, టీబీ, ఇమ్యూనిటీ తగ్గిపోవడం వంటి జబ్బులు వస్తుంటాయి. మెరుగైన వైద్యం అందించేందుకు నెల్లూరులోని పెద్దాస్పత్రిలో ప్రభుత్వం ఏఆర్టీ (యాంటీ రిట్రోవైరల్ థెరపీ) క్లినిక్ ఉంది. ఇక్కడికి వచ్చే రోగులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. వారి బాధలు వర్ణనాతీతంగా మారాయి.

నెల్లూరు(అర్బన్): పెద్దాస్పత్రిలోని ఏఆర్టీ సెంటర్‌లో నీటి చుక్క కరువైంది. తాగేందుకే గుక్కెడు నీరు దొరికే పరిస్థితి లేదు. మరుగుదొడ్లలో నీటి వసతి లేకపోవడంతో ఇక్కడికి వచ్చే రోగులతోపాటు వైద్య సిబ్బంది సైతం నరకాన్ని చవిచూస్తున్నారు. జిల్లాలో హెచ్ఐవీ – ఎయిడ్స్ బారిన రోగులకు వైద్య సేవలందించేందుకు ఏర్పాటు చేసిన కేంద్రంలో దారుణమైన పరిస్థితులున్నాయి. వైద్యం చేయించుకునేందుకు దాదాపు 8,500 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రోజూ 400 నుంచి 450 మంది వరకు వైద్యసేవలు పొందేందుకు వస్తున్నారు. ముగ్గురు డాక్టర్లు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, అటెండర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉన్నారు. రోగులను పరిశీలించి నెల నుంచి రెండు నెలలకు సరిపడా మందులు ఇస్తుంటారు.

నీటి వసతి లేక దుర్భరం

ఏఆర్టీ సెంటర్‌లో నీటి వసతి లేక పరిస్థితి దుర్భరంగా మారింది. మంచినీటిని బయట కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. పోనీ అత్యవసరంగా మరుగుదొడ్డికి వెళ్దామంటే కుళాయిలు మరమ్మతులకు గురై అక్కడ కూడా నీరు రావడం లేదు. దీంతో రోగుల కోసం ఏర్పాటు చేసిన టాయిలెట్స్‌కు నెలల తరబడిగా తాళం వేశారు. డాక్టర్లు, నర్సులు కొంచెం దూరంలో ఉన్న పెద్దాస్పత్రిలోని ఇతర బ్లాక్‌ల్లోని మరుగుదొడ్లు వినియోగిస్తున్నారు. రోగులకు అవకాశం లేక నరకం అనుభవిస్తున్నారు. వారికి హిమోగ్లోబిన్‌తోపాటు ఇమ్యూనిటీ తెలుసుకునేందుకు సీడీ – 4 కౌంట్ వంటి రక్త పరీక్షలు చేయాలి. అక్కడ టెస్ట్‌ట్యూబ్‌లను, ఇతర మెడికల్ బాటిల్స్‌ను శుభ్రంగా కడిగేందుకు నీరు కావాలి. నీరు రాకపోవడంతో టెక్నీషియన్ బకెట్‌తో తెచ్చుకుని పరీక్షలు చేస్తున్నారు. పలుచోట్ల విద్యుత్ వైర్లు మరమ్మతులకు గురైనా వాటిని సరిచేసేందుకు ఎలక్ట్రీషియన్ లేదు. దీంతో విద్యుత్ కూడా సరఫరా కావడం లేదు.

గోదాములుగా..

ఏఆర్టీ సెంటర్‌లోని కుళాయిల్లో నీరు రాకపోవడంతో డాక్టర్లు, నర్సులు ఉపయోగించే మరుగుదొడ్లను గోదాములుగా ఉపయోగిస్తున్నారు. అక్కడ మందులకు సంబంధించిన అట్టపెట్టెలు, ఇతర మెటీరియల్‌ను ఉంచుతున్నారు. సెంటర్ చుట్టూ పిచ్చిమొక్కలు పెద్దఎత్తున పెరిగాయి. అక్కడ తరచూ విషసర్పాలు తిరుగుతున్నాయి. పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ఇంకా సెంటర్‌లోని భవనాలను చీల్చుకుంటూ చెట్లు పెరుగుతున్నాయి. వేర్లు గోడల్లోకి చొచ్చుకుని పోతున్నాయి. అయినా అధికారులు స్పందించి ఆ చెట్లను తొలగించడం లేదు. దీనికితోడు సెంటర్‌కు కేటాయించిన బ్లాక్‌లోని గదులలో డీబీసీ (డిస్ట్రిక్ట్ బ్లైండ్ కంట్రోల్ సొసైటీ) అధికారులు రెండు నెలలు ఉపయోగించుకుంటామని రెండు గదులు తీసుకున్నారు. వాటిని ఖాళీ చేయకపోవడంతో అక్కడికి వచ్చే రోగులూ ఇబ్బందులు పడుతున్నారు. బయో మెడికల్ వారు మరో గదిని, పెస్ట్ కంట్రోల్ వారు ఇంకొక గదిని తమ ఆధీనంలో ఉంచుకోవడంతో డాక్టర్లు, రోగులు ఇబ్బందులు పడుతున్నారు.



దాక్టర్ల మరుగుదొడ్లలో ఉంచిన అట్టపెట్టెలు



సెంటర్ చుట్టూ పిచ్చిమొక్కలు



పెద్దాస్పత్రిలోని ఏఆర్టీ సెంటర్

పట్టించుకోకుండా..

ఏఆర్టీ సెంటర్‌లో ఉండే డాక్టర్లు, నర్సులు, సిబ్బంది జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్ఓ) కంట్రోల్‌లో ఉంటారు. భవనం, కనీస వసతులు కల్పించాల్సింది మాత్రం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలో ఉన్న పెద్దాస్పత్రిలోని అధికారులు. అయితే రెండు శాఖల అధికారులు సమస్యలు తమవి కాదన్నట్లు ఒకరిపై ఒకరు చెప్పుకొంటూ పట్టించుకోవడం లేదు.

పరిస్థితులు చక్కదిద్దుతున్నాం

ఏఆర్టీ సెంటర్‌కు కేటాయించిన భవనాలు పురాతనమైనవి. అక్కడ వసతులు కల్పించేందుకు ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా ఎస్టిమేషన్ వేయించాం. త్వరలోనే అక్కడ నీటి వసతికి ఇబ్బంది లేకుండా చేస్తాం. సెంటర్ చుట్టూ జంగిల్ క్లియరెన్స్ (పిచ్చిమొక్కలు, గడ్డి) చేయిస్తాం.

– డాక్టర్ సిద్ధానాయక్, పెద్దాస్పత్రి సూపరింటెండెంట్



శిథిలావస్థకు చేరుకున్న ట్యాంక్‌లు

చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలు

- పాతనేరస్తుడి అరెస్ట్
- రూ.6 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలకు పాల్పడుతూ పోలీసుల కళ్లు కప్పి తిరుగుతున్న ఓ పాతనేరస్తుడిని గురువారం నెల్లూరు దర్గామిట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.6 లక్షలు విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నగర డీఎస్పీ పి.సింధుప్రియ తన కార్యాలయంలో దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్యతో కలిసి వివరాలను వెల్లడించారు. నెల్లూరు కొండాయపాళెంగేటు సమీపంలోని ఓల్డ్ మిలటరీ కాలనీలో రామ్మోహన్ కుటుంబం నివాసం ఉంటోంది. ఈనెల 13వ తేదీన వారు ఇంట్లో లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతికత, ఘటనా స్థలంలో లభ్యమైన ఆధారాల మేరకు నిందితుడిని వనంతోపు రామకృష్ణనగర్‌కు చెందిన జి.సునీల్‌గా గుర్తించారు. ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో ఎస్సై రమేష్‌బాబు తన సిబ్బందితో కలిసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం కొండాయపాళెంగేటు వద్ద అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించి విచారించారు. మిలటరీ కాలనీతోపాటు దర్గామిట్ట పరిధిలో గతేడాది మరో మూడు దొంగతనాలు చేసినట్లు నేరం అంగీకరించడంతో అతడిని అరెస్ట్ చేశారు. పదిన్నర సవర్ల బంగారు ఆభరణాలు, 50 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ వెల్లడించారు. సునీల్ పంబ్లింగ్, ఎలక్ట్రికల్ పనులు చేసేవాడు. చెడు వ్యసనాలకు బానిసై దొంగగా మారాడు. తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతూ వచ్చిన సొమ్ముతో జల్సాగా జీవించసాగాడు. అతడిపై ఇప్పటికే నెల్లూరు నగరంలో తొమ్మిది కేసుల ఉన్నాయి. కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్, ఎస్సై, సిబ్బంది మహేంద్రనాథ్‌రెడ్డి, ఖాజారహంతుల్లా, శామ్యూల్, వేణు తదితరులను డీఎస్పీ అభినందించారు.



నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ సింధుప్రియ

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఎస్సీ నిరుద్యోగులకు సంబంధిత కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల మంజూరుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఇన్‌చార్జి ఈడీ డాక్టర్ ఎ.నిర్మలాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అర్హులైన ఎస్సీలను గుర్తించి నిబంధనల మేరకు రుణాలను అందిస్తామన్నారు. 21 నుంచి 50 సంవత్సరాల్లోపు వయసున్న వారు అర్హులన్నారు. ఆధార్, కుల, ఆదాయ, తెల్లరేషన్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలు తదితర వివరాలతో ఏపీఓబీఎంఎంఎస్ పోర్టల్లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ట్రాన్స్‌పోర్ట్ సెక్టార్లో 316 యూనిట్లు, పశుసంవర్ధక శాఖకు సంబంధించి 320 యూనిట్లు, చిన్న తరహా పరిశ్రమలు 380, వ్యవసాయాధారిత సెక్టార్‌కు 118 యూనిట్లు అందిస్తామన్నారు. ప్రతి యూనిట్‌కు 50 శాతం సబ్సిడీ, ఐదు శాతం లబ్ధిదారుడి వాటా, మిగిలినది బ్యాంక్ రుణం ఉంటుందని వెల్లడించారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

WANTED
Good opportunity at Volkswagen Nellore.
We urgently required
• ASM (Sales)
• Teamleaders
• Sales Executives
Experience will be preferable.
LM AUTO CARS PVT. LTD
SY NO. 249/282 & 249, NH-5, Chemudugunta, Venkatachalam, Nellore. ✆ 9908542222

అధికారమే అండగా..

- అక్రమ మైనింగ్‌కు ప్రయత్నాలు
- తెల్లరాయి వెలికి తీసేందుకు సన్నాహాలు
- వ్యతిరేకిస్తున్న స్థానికులు

పొదలకూరు: అధికారాన్ని అడ్డు పెట్టుకుని అక్రమ మైనింగ్ చేసేందుకు కొందరు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అనుమతి లేకుండా బయటి ప్రాంతాలకు చెందిన వారు ఈ ప్రాంతంలో కొండలు, గుట్టల వద్ద మైనింగ్ చేయాలని చూస్తుండగా స్థానికులు వ్యతిరేకిస్తూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు.

పొదలకూరు మండలంలో సహజ సిద్ధంగా ఏర్పడిన కొండలు, గుట్టలున్నాయి. ఇక్కడ గతంలో సుమారు 20 వరకు చిన్నా, పెద్ద మైన్లు ఉండేవి. మైకా కూడా వెలికి తీసేవారు. క్రమంగా మైకా కనుమరుగవడంతో తెల్లరాయికి డిమాండ్ పెరిగింది. పోటీలు పడి దానిని తరలించిన సందర్భాలున్నాయి. మైనింగ్ అనుమతులను కొందరు రెన్యువల్ చేసుకోవాలా? వద్దా? అనే సందిగ్ధంలో ఉండగా మరికొందరు మాత్రం అక్రమంగా చేసి ధనార్జన ఎత్తుగడలో ఉన్నారు. పట్టణానికి కూతవేటు దూరంలో చిట్టేపల్లితిప్ప సర్వేపల్లి 707లో కలువాయి మండలానికి చెందిన ఓ వ్యక్తి తెల్లరాయి మైనింగ్ చేస్తుండగా అధికారులకు ఫిర్యాదులు అందాయి. బయటి వ్యక్తి ఇక్కడ మైనింగ్ చేస్తున్నాడంటే స్థానికంగా అతడికి అండదండలు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది.



వెలికితీసిన రాయి

తెల్లరాయికి డిమాండ్

తెల్లరాయికి డిమాండ్ ఉంది. కూటమి ప్రభుత్వంలో అనుమతులు లభిస్తుండటంతో ఈలోగా అక్రమంగా మైనింగ్ చేసేందుకు కొందరు పూనుకున్నారు. అటవీ శాఖ భూముల్లో సైతం తెల్లరాయి తవ్వకాలకు ప్రయత్నిస్తున్నారు. అలాగే అనుమతుల కోసం తిరుగుతున్నట్టు తెలిసింది. ఇక్కడ ఎలాంటి మైనింగ్ చేసినా సిండికేట్‌కు అప్ప గించాలనే ప్రచారం ఉంది. అంతా వారు చూసుకుంటారనే ధైర్యంతో అక్రమంగా మైనింగ్‌కు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. చిట్టేపల్లితిప్ప వద్ద అక్రమ మైనింగ్ చేస్తుండగా ఎంపీటీసీ సభ్యుడు గుంటి శ్రీనివాసులు ఇటీవల తహసీల్దార్ శివకృష్ణయ్యకు ఫిర్యాదు చేశారు. ఆయన వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై హనీఫ్ తన సిబ్బందితో రాత్రి వేళ ఘటనా స్థలానికి వెళ్లి పొక్లెయిన్‌ను సీజ్ చేయడంతో పాటు, అక్కడ వెలికితీసిన రాయిని కూడా స్టేషన్ వద్దకు తరలించారు.

తెల్లరాయి మైనింగ్ వద్దంటూ..

- తూర్పురొంపిదొడ్ల గ్రామస్తుల ఆందోళన

వరికుంటపాడు: మండలంలోని తూర్పురొంపిదొడ్ల సమీపంలో తెల్లరాయి మైనింగ్ వద్దంటూ గ్రామస్తులు గురువారం ఆందోళన నిర్వహించారు. అనుమతులిచ్చిన ప్రాంతం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ సమీపంలో పశువుల మేత పోరంబోకు భూమి ఉందన్నారు. అక్కడ తెల్లరాయి మైనింగ్‌కు అనుమతులిచ్చినట్లు తెలిసిందన్నారు. దీనికి సమీపంలో నివాస గృహాలు, ఆలయాలు, ఉప్పువాగు ఉన్నట్లు తెలిపారు. ఇటీవల రాత్రివేళల్లో తవ్వకాలు జరిపేందుకు కొందరు రాగా తాము అడ్డుకున్నామన్నారు. మైనింగ్ అనుమతులు రద్దు చేయకపోతే తాము జీవనాధారం కోల్పోవడంతోపాటు, నివాసాల్లో ఉండలేని పరిస్థితి వచ్చి వలసలు వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే కలెక్టర్, మైనింగ్ అధికారులు, తహసీల్దార్ ఫిర్యాదులు చేశామన్నారు.



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DIRECT FINAL YEAR
■Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA,MCA.Regular/lateral entry.9381287629 [T-2478]

REAL ESTATE

FLAT FOR SALE
■నెల్లూరు పార్థసారథి నగర్‌లో తూర్పు ఫేసింగ్, ఫుల్ ఉడ్ వర్క్ గల 2BHK (1100 Sft) అన్ని వసతులతో గల Flat అమ్మబడును. నో బ్రోకర్స్. వివరాలకు సంప్ర : 91002 95397. [NA-6794]

PLOT FOR SALE
■Srihari Nagar West Facing. 36 ankanams Plot for Sale. Further details Contact : 98482 67839. [NA-3934]
■Harnathapuram Road No.2, Plot No.3, 88X40 Size, 48 Ankanalu Plot for Sale. @ 65 feet Mutukur- Krishna patnam Road. Ph: 9848362273 [HA-1103]

SHOP FOR SALE
■నెల్లూరు పెదపదుగుపాడులో చేప పిల్లల పెంపకం కేంద్రం వెనుక షాపులు అమ్మకమునకు కలవు. Rs. 55 లక్షలు. సంప్రదించండి : 91544 60072, 99481 35809. [N-1256633]

SERVICES

GOLD FINANCE
■బ్యాంకులలో వివిధ తాకట్టు సంస్థలలో ఉన్నవి బంగారు వేలం సమయానికి విడిపించి మార్కెట్ ధర ప్రకారం స్పాట్ క్యాష్ ఇవ్వబడును. సెల్: 98851 82772, 62813 46878. [N-1266732]

TOURS & TRAVELS
■ఒరిస్సా తేది 07.02.25 4రో టి 1కి 8000/-, కర్ణాటక తేది 22.02.25 6రో టి 1కి 11,000/- (రూం+భోజనం) కె.వాసు, నెల్లూరు. వివరములకు సంప్రదించండి: 94913 40504. [NA-23945]

WANTED
■Wanted Sales Men & Mechanics SSR TVS Show Room, Saluchinthala, Kovur. Contact: 8247204311. [NA-23947]
■Wanted Faculty to Teach Tally, Web Developer, Spoken English & Communication Skills. Further Details Contact : 62812 59285. [NA-3035]

మెట్ట పొలం కావలెను.
మండలానికి / గ్రామానికి 1కి.మీ దూరంలో 33 అడుగుల దారి కల్గిన 4 ఎకరాలు మెట్ట పొలం ఇండస్ట్రియల్ కొరకు కావలెను.
1 ఎకర 5లక్షలు
సెల్: 7997775678

■ Immediate joining for AYYAPPA AGENCIES Banking Collections Dept (HDFC & SBI BANK), required Team Leaders - 1+yrs Exp., Collection Executives both Fresher & Exp. can apply Location : Nellore. Contact Cell: 99662 40143/ 75693 26028. [T-789066]
■ప్రముఖ MNC కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీలు పురుషులు కావలెను. అర్హత: 10th–డిగ్రీ, ఆకర్షణీయమైన జీతం వర్క్ ఫ్రం హోం అవకాశం కల్పించబడును. 9110256233, 7975935948 [G-9136]
■నలంద CBSE స్కూలు కావలి నందు 6th to 10th హిందీ, ఇంగ్లీషు, సోషల్ బోధించుటకు టీచర్లు కావలెను. నాన్‌లోకల్స్‌కి భోజన వసతి కల్పించబడును. 91210 94995, 99894 33348. [N-1256632]
■ఆఫీస్ స్టాఫ్ కావలెను. DTP కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. తెలుగు టైపింగ్ చేయు వారికి ప్రాధాన్యత. వివరాలకు సంప్రదించండి. సెల్ : 77803 33090. [NA-5480]
■ఫోర్డ్ కంపెనీ షోరూం నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, మెకానిక్స్, హెల్పర్స్, వాచ్‌మెన్ (ఫ్యామిలీ) కావలెను. 95812 99916, 94929 34103. Location : బుజబుజనెల్లూరు. [NA-3033]
■అపూర్వ క్లినిక్ నందు పని చేయుటకు నర్సింగ్ స్టాఫ్ & ల్యాబ్ టెక్నీషియన్స్ కావలెను. (పార్ట్/ఫుల్ టైం). సెల్ : 78934 77911. Location : కావేరి నగర్, పడారుపల్లి, నెల్లూరు. [NA-3034]
■నెల్లూరులో పని చేయుటకు కావలెను. సెక్యూరిటీ గార్డ్స్ జీతం: 18000/- లేడీ సెక్యూరిటీ గార్డ్స్ జీతం: 14,000/-. వివరములకు సంప్రదించండి: 99594 44086, 94900 22205. [NA-23987]
■ప్రముఖ రియల్ ఎస్టేట్ నందు మార్కెటింగ్ చేయుటకు లేడీస్ అండ్ జెంట్స్ కావలెను. LIC ఏజెంట్స్, పొదుపు లీడర్, గృహిణులు కావలెను. జీతం : 20,000/-. సెల్ : 80086 15946. [NA-23988]
■శ్రీ మ్యారేజ్ కన్సల్టెన్సీ నందు పని చేయుటకు లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. అడ్రసు : కొండాయిపాళెంగేట్ ఎదురువీధి, నెల్లూరు. వివరాలకు సంప్రదించండి: 8885567277, 8985048177. [NA-6782]
■విజయకేర్ హాస్పిటల్,నెల్లూరు, విజయమహల్ గేట్ దగ్గర నర్సులు (అనుభవం కల్గిన ANM, GNM, B.Sc Trained మె॥ నర్సులు), ఆయమ్మలు కావలెను. 99485 45299, 99894 33567. [NA-6793]

PASSPORT LOST
I, MOHAMMED VIKHAR AHAMED, S/o. Mohammed Sardar Ahamed, residing at D.No.22-328, Faizulla Baigdarga Street, Big Bazar, Nellore, SPSR Nellore District, A.P. I have Lost my Original Passport No M4073455, While I am going from my House to the Xerox Shop at Big Bazar, Nellore. If anyone found please inform to the above address or call : 9700046746

■ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12,000/-. సంప్ర : 72074 45296 [V- 6651]
■ ప్రముఖ మైనింగ్ కంపెనీకి 5-10 సం॥ అనుభవం గల HR / ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్, టిప్పర్ IT డీజిల్ మెకానిక్స్-2, Sr & Jr ఎలక్ట్రీషియన్స్-2 వెంటనే కావలెను. కేశవ్. 99894 88310 [B-454]
■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికిస్త్రీలు/పురుషులు,ఆయా,నర్సులు,వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ:15 వేలు – 40వేలు,ఫ్రీరూం+భోజనం.HYD. 9666253675 [HA-99631]
■నర్సింగ్ స్టాఫ్ డాక్టర్లు కావలెను. నెల్లూరు, పొగతోటలోని ప్రముఖ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌కు అనుభవం కలిగిన GNM / B.Sc నర్సింగ్ స్టాఫ్ వార్డు / ఆపరేషన్ థియేటర్‌లో పని చేయుటకు కావలెను.Duty Doctors; Pharma-D చేసిన వారు కావలెను. ఆకర్షణీయమైన జీతం. 89608 80044. [NA-2776]
■DINSHAW'S (Since 1932), HIMA CREAM ICE CREAM వారికి Door to Door పోయి Customers ని ఒప్పించి ICE CREAM Orders Book చేయుటకు Marketing లో అనుభవం ఉన్న స్త్రీ / పురుషులు Sales Executives కావలెను. జీతం: రూ.15,000, Incentive + TA + DA + ESI + PF. కలవు. Bike, Smart Mobile ఉండవలెను. Contact: 78010 34111. [NA-23981]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.